కలం

ప్రజల గళం...

kalamdaily.com

Follow on: Kalamtelugu

శనివారం ● 25-04-2026

పేజీలు: 5




SINGLE TOPIC

కొత్త పార్టీ




# మళ్లీ పుట్టిన టీఆర్ఎస్

## మూడక్షరాల సెంటిమెంట్ అస్త్రంగా కవిత ఎంట్రీ

### బీఆర్ఎస్ అసంతృప్తులను ఆకర్షించే వ్యూహం

### తండ్రి పార్టీని వాడుకుంటూనే విమర్శల వర్షం

### గ్రామీణ ఓటర్లకు దగ్గరయ్యేలా పార్టీ నేమ్ ఫిక్స్

### అన్న అలర్టయ్యేలోపే అందిపుచ్చుకున్న చెల్లెలు

### పార్టీ జెండా రంగుల వెనక రాజకీయం.. ఎంపికలో స్ట్రాటజీ



తెలంగాణలో టీఆర్ఎస్ మళ్లీ పుట్టింది. కానీ, దాని పేరు మాత్రం తెలంగాణ రాష్ట్ర సమితి కాదు.. తెలంగాణ రాష్ట్ర సేన! అప్పటి టీఆర్ఎస్ సృష్టికర్త కల్వకుంట్ల చంద్రశేఖరరావు.. ఇప్పటి టీఆర్ఎస్ వ్యవస్థాపకురాలు ఆయన కుమార్తె కల్వకుంట్ల కవిత. పార్టీ పేరు ఏదైనా టీఆర్ఎస్ అనే మూడక్షరాల అబ్రివేషన్ మాత్రం కల్వకుంట్ల ఫ్యామిలీకే చెందాలనే ఫార్ములా వర్కవుట్ అయింది. నాడు తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంలో టీఆర్ఎస్ అనే పదం ప్రజల తలలో నాలుకలాగా స్థిరపడింది. ఇప్పుడు కవిత పెట్టిన కొత్త పార్టీతో మరోసారి ఆ పదం తెరమీదికి వచ్చింది.

టీఆర్ఎస్ వ్యవస్థాపకుడు కేసీఆర్ తన పార్టీ పేరును భారత రాష్ట్ర సమితిగా 2022లో మార్చుకున్నారు. దీంతో టీఆర్ఎస్ అనే పదం బీఆర్ఎస్‌గా మారిపోయింది. నాలుగేండ్లుగా టీఆర్ఎస్ అనే పదమే ఉనికిలో లేదు. పేరు మార్చడంతోనే తెలంగాణతో ఉన్న పేగుబంధం తెగిపోయిందనే విమర్శలు వచ్చాయి. ఓడ దాటే దాక.. సామెత తరహాలో కేసీఆర్ తీరును జనం తిట్టుకున్నారు. పార్టీ శ్రేణుల్లోనూ అసంతృప్తి భగ్గుమన్నది. సరిగ్గా దాన్ని కవిత అందిపుచ్చుకున్నారు. ఆ పదానికి ఉన్న సెంటిమెంట్‌ను, పాపులారిటీని కొత్త పార్టీ రూపంలో తనకు అనుకూలంగా మల్చుకున్నారు.

**ఇప్పటివరకూ రాష్ట్రంలో మూడు ప్రధాన పార్టీల మధ్య రాజకీయ పోరు మూడు ముక్కలాటగా ఉన్నది. ఇప్పుడు కవిత కొత్త పార్టీ ఎంట్రీతో అది నాలుగు స్థంభాలాటగా మారనున్నది. ఒకవైపు టీఆర్ఎస్ అనేది తెలంగాణతో పేగుబంధం అనే సెంటిమెంట్. మరోవైపు తండ్రి అనాలోచిత నిర్ణయంతో కోల్పోయిన ఆ స్వభావాన్ని ఆ పార్టీ కోల్పోయిందనే అపవాదు. దానికి బలం చేకూర్చేలా అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని చేజార్చుకున్నది. ఇప్పుడు టీఆర్ఎస్ అనే మూడక్షరాలకు ప్రజలతో ఉన్న బాండ్‌ను, పాపులారిటీని కవిత తన పొలిటికల్ కెరీర్‌కు వాడుకోనున్నారు.**

పార్టీ పేరులోనే కాకుండా జెండాలోని రంగులనూ వ్యూహం ప్రకారం ఎంపిక చేసుకున్నారు. ఎస్సీ, బీసీలకు దగ్గరయ్యేలా నీలం రంగు, బీఆర్ఎస్‌లోని పూర్వ తెలుగుదేశం లీడర్లు, కేడర్‌ను ఆకర్షించేలా పసుపు రంగును సెలెక్ట్ చేసుకున్నారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, మహిళలు, యువత.. ఇలా వివిధ సెక్షన్ల ఓటర్లకు దగ్గరయ్యేలా ఫైవ్ గ్యారంటీస్ తరహాలో హామీలు గుప్పించారు. మహిళ నేతృత్వంలో పురుడు పోసుకున్న టీఆర్ఎస్ మూడు ప్రధాన పార్టీలనూ టార్గెట్ చేస్తున్నది. తండ్రి పెట్టిన టీఆర్ఎస్ అబ్రివేషన్‌ను వాడుకుంటూనే ఆయననే కవిత విమర్శిస్తున్నారు.

టీఆర్ఎస్ అనే మూడక్షరాల కొత్త పార్టీ కవితకు అడ్వాంటేజ్ అవుతుందా?.. కాపీ కొట్టారన్న నెగెటివ్ ప్రాపగండా డిస్ అడ్వాంటేజ్ అవుతుందా?.. ఓట్లను చీల్చే పాత్రకే ఆ పార్టీ పరిమితవుతుందా?.. బీఆర్ఎస్‌కు ఆల్టర్నేట్‌గా మారుతుందా?.. 'టీఆర్ఎస్' అబ్రివేషన్ ఎంపిక వెనక ఆమె వ్యూహమేంటి?.. వీటిపై కలం ప్రత్యేక కథనం..

- తెలంగాణ బ్యూరో, కలం




## నాడు తండ్రి ఆలోచన.. నేడు కూతురి ఆచరణ

25 ఏండ్ల కింద తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో కేసీఆర్ కొత్త పార్టీని స్థాపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే ఆ పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నారు. టీఆర్ఎస్ పేరుతో అది తెలంగాణ ప్రజల్లోకి చొచ్చుకెళ్లింది. పార్టీ పెట్టిన కొత్తలోనే పంచాయతీ ఎన్నికల్లో గెలుపుతో అది ప్రజల ఆదరణను చూరగొన్నది. మలి దశ ఉద్యమంలో తెలంగాణ అంటే టీఆర్ఎస్.. టీఆర్ఎస్ అంటే తెలంగాణ అనే తరహాలో జనం సొంతం చేసుకున్నారు. ఎందరో ఉద్యమకారుల పోరాటం, ఎందరో అమరుల త్యాగాల ఫలంగా సరిగ్గా పద్నాలుగేండ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. 2014లో రాష్ట్రం ఏర్పడటంతోనే టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. రెండో టర్ములో తిరుగులేదనే ఆలోచనతో టీఆర్ఎస్ పేరును కేసీఆర్ బీఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి)గా మార్చారు. సొంత పార్టీ కేడరే దాన్ని జీర్ణించుకోలేకపోయారు. పార్టీ నుంచి 'తెలంగాణ' పదాన్ని తొలగించడాన్ని ప్రజలూ యాక్సెప్ట్ చేయలేదు. చివరికి అధికార పీఠం నుంచి దింపేశారు. ఆ గ్యాప్‌ను కవిత అనుకూలంగా మల్చుకునే ప్లాన్ చేశారు. 'టీఆర్ఎస్' అబ్రివేషన్ వచ్చేలా తెలంగాణ రాష్ట్ర సేన పేరుతో కొత్త పార్టీ పెట్టారు.

## కేసీఆర్ తప్పిదమే అస్త్రంగా..!

పార్టీ పేరు మార్చడంతో రాజకీయంగా దెబ్బతిన్న కేసీఆర్ అనుభవమే ఇప్పుడు కవితకు పొలిటికల్ అస్త్రంగా దొరికింది. ప్రజల్లో 'టీఆర్ఎస్' అనే మూడక్షరాల పట్ల ఉన్న ఆదరణను రాజకీయంగా సద్వినియోగం చేసుకోడానికి దోహదపడుతున్నది. తండ్రి ఆలోచనల గురించి లోతైన అవగాహన ఉన్న కవిత.. ముల్లును ముల్లుతోనే తీయాలన్న వ్యూహాన్ని ఎంచుకున్నారు. ఏ మూడక్షరాల పదం కేసీఆర్ కు అధికారాన్ని కట్టబెట్టిందో అదే పదాన్ని తీసేయడంతో అధికారం నుంచి దిగిపోవాల్సి వచ్చిందన్న అభిప్రాయాన్ని తెలుసుకొని.. సరిగ్గా ఆ అబ్రివేషన్ వచ్చేలా పార్టీ పేరును ఆమె ఎంపిక చేసుకున్నారు.

## రూరల్ ఓటర్ల కన్‌ఫ్యూజన్ అడ్వాంటేజ్

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మంది బీఆర్ఎస్ ను టీఆర్ఎస్ అనే పిలుస్తారు. నాలుగేండ్లు అవుతున్నా బీఆర్ఎస్ అని పిలవడం అలవాటు కాలేదు. మరికొందరికి 'బీఆర్ఎస్' అని పిలవడం ఇష్టం లేదు. కేసీఆర్ అంటే టీఆర్ఎస్ అనే మైండ్‌సెట్ కంటిన్యూ అవుతున్నది. ఇప్పుడు కవిత టీఆర్ఎస్ పేరుతో వస్తుండడంతో అలాంటి ఓటర్ల కన్‌ఫ్యూజన్ ఆమెకు అడ్వాంటేజ్‌గా మారే అవకాశాలున్నాయి. టీఆర్ఎస్ అనే ఒక సెంటిమెంట్ మళ్లీ క్రియేట్ అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆ పేరు పెట్టుకోవడంతోనే ఆమె సొంత పొలిటికల్ కెరీర్ సగం సక్సెస్ అయిందన్న మాటలూ వినిపిస్తున్నాయి. అయితే ఆ మూడక్షరాలే కవిత పొలిటికల్ జర్నీని డిసైడ్ చేస్తాయా?.. ఆమె ఆచరణ, విజన్‌కు అనుగుణంగా ప్రజలు ఆ జర్నీని నిర్ణయిస్తారా?! భవిష్యత్తే తేలుస్తుంది.

## బీఆర్ఎస్ పేరుతో ఉన్న అసంతృప్తి కలిసొస్తుందా?

బీఆర్ఎస్ పేరుతో ఆ పార్టీ శ్రేణుల్లో నెలకొన్న అసంతృప్తి ఇప్పుడు కవితకు ఏ మేరకు కలిసొస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది. టీఆర్ఎస్ పదమే ఒక వైబ్రేషన్ కలిగిస్తుందనేది ఆ పార్టీ కేడర్‌లో ఒక సాధారణ అభిప్రాయం. అధినేత నిర్ణయంతో కక్కలేని మింగలేని స్థితిలో పడ్డారు. ఇప్పుడు తిరిగి టీఆర్ఎస్ పేరుకు వెళ్లాలన్న దారులు మూసుకుపోయాయి. ఆ అవకాశం లేకపోవడంతో టీఆర్ఎస్ పేరుతో పుట్టుకొచ్చిన పార్టీకి దగ్గరయ్యే అవకాశాలనూ కాదనలేకపోతున్నారు కొందరు. బీఆర్ఎస్ కేడర్‌లోని అసంతృప్తి ఒక మేరకు టీఆర్ఎస్ పేరు పెట్టుకున్న కవితకు అనుకూలంగా మారుతుందన్న అభిప్రాయాలూ లేకపోలేదు.

## అన్న ఆలోచనను ఆక్రమించేసిన చెల్లెలు

బీఆర్ఎస్ అని పేరు మార్చుకోవడం చాలా మంది కేడర్‌కు ఇష్టం లేదని, మళ్లీ పాత పేరుకే వెళ్లాలనే ఒత్తిడి వస్తున్నది ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్ అవుతుందో లేదో తెలియదుగానీ శ్రేణుల అభిప్రాయాన్ని మాత్రం ఆయన వ్యక్తం చేశారు. పేరు మారడంతోనే అధికారానికి దూరం కావాల్సి వచ్చిందనే బలమైన అభిప్రాయమూ పార్టీలో నెలకొన్నది. భవిష్యత్తులో మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చే ఉద్దేశం ఉన్నదో లేదోగానీ ఆ అవకాశం కేటీఆర్ అండ్ టీమ్ కు లేకుండా కవిత బ్రేకులు వేశారు. పార్టీ పూర్తి పేరు ఏదైనా అబ్రివేషన్ టీఆర్ఎస్ అనేది కవిత తన పార్టీకి పెట్టుకుకోవడంతో అన్నకు చెల్లి ఝలక్ ఇచ్చినట్లయింది.









## పూర్తి పేరు ఏదైనా 'టీఆర్ఎస్' కల్వకుంట్ల ఫ్యామిలీకే!

పార్టీ పూర్తి పేరు ఏదైనా టీఆర్ఎస్ అనే అబ్రివేషన్ మాత్రం కల్వకుంట్ల ఫ్యామిలీ దగ్గరే ఉన్నది. మరొకరి చేతుల్లోకి పోకుండా చూసుకున్నట్లయింది. ఇంతకాలం తండ్రి దగ్గర ఉన్న టీఆర్ఎస్.. ఇప్పుడు కూతురి దగ్గరకు చేరింది. ఆల్రెడీ ఆ పదానికి ఉన్న పాపులారిటీ మరొకరికి దక్కకుండా కవిత జాగ్రత్త పడ్డారు. ఒకవేళ బీఆర్ఎస్ తిరిగి టీఆర్ఎస్‌గా మారినా కల్వకుంట్ల ఫ్యామిలీ దగ్గరే ఉంటుంది. ఇప్పుడు కవిత దాన్ని టేకోవర్ చేసినా ఆ ఫ్యామిలీ దగ్గరే ఉన్నట్లయింది. ఫ్యామిలీ పకడ్బందీ ప్లాన్‌తో ఈ వ్యవహారం నడిచిందేమో అనే అనుమానాలు లేకపోలేదు. చివరకు టీఆర్ఎస్ అనేది కల్వకుంట్ల ఫ్యామిలీ పేటెంట్ అనే తరహాగా తయారైంది.

## కవిత స్ట్రాటజీతో డ్యామేజ్ అయ్యేది ఏ పార్టీ?

కవిత పెట్టిన కొత్త పార్టీ ఇప్పుడున్న మూడు ప్రధాన పార్టీల్లో దేనికి ఎసరు పెడుతుందనే చర్చలు ఎలా ఉన్నా ఏ మేరకు ఓట్లు చీలుస్తుందనేది కీలకమైంది. తమిళనాడులో కొత్తగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన సినీ నటుడు విజయ్ ఎన్ని సీట్లు గెలుస్తారనే అంశం కంటే ఏ పార్టీని ఎక్కువ డ్యామేజ్ చేస్తారనే చర్చ అక్కడ జరుగుతున్నది. రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కవిత పెట్టే పార్టీ బీఆర్ఎస్‌ను డ్యామేజ్ చేస్తుందా?.. లేక కాంగ్రెస్‌కు ఎసరు పెడుతుందా?.. అనేది ఆసక్తికరంగా మారింది. ఆమె పార్టీ అధికారంలోకి వస్తుందనే నమ్మకాలు ఇప్పటికిప్పుడు జనంలో లేకపోయినా ఓట్ల చీలిక ఏ పార్టీకి లాభం?.. ఏ పార్టీకి నష్టం అనేదే కీలక చర్చగా మారింది.

## అన్ని పార్టీల టార్గెట్ కేసీఆరే

రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకూ కేసీఆర్ టార్గెట్‌గా మారారు. పదేండ్ల ఆయన పాలనపై కాంగ్రెస్, బీజేపీ ఎక్కువగా విమర్శిస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా సొంత పొలిటికల్ పార్టీతో ఎంట్రీ ఇస్తున్న కవిత కూడా కేసీఆర్‌నే కార్నర్ చేశారు. ఆ నాడు తెలంగాణ ఉద్యమంలో మమకారం, ఆత్మతో వ్యవహరించారని.. ఇప్పుడు మనసు లేని మరమనిషిగా మారారని కవిత ఫైర్ అయ్యారు. పార్టీ పెట్టడంతోనే కేసీఆర్‌ను విమర్శించడంపై ఫోకస్ పెట్టారు. ఇప్పటిదాకా బీజేపీ, కాంగ్రెస్ మాత్రమే విమర్శిస్తే ఇప్పుడు టీఆర్ఎస్ పేరుతో తెరమీదకు వచ్చిన కవిత కూడా ఆ జాబితాలో చేరారు.



## కలర్స్ కాంబినేషన్ వెనక మతలబేంటి?

తెలంగాణ రాష్ట్ర సేన పేరుతో టీఆర్ఎస్ పార్టీకి జీవం పోసిన కవిత ఆ పార్టీ జెండాకు ఎంచుకున్న రంగులు కూడా చర్చకు దారితీశాయి. వాటి ఎంపికకు ఉన్న ప్రాధాన్యతను ఆమె వివరించారు. పసుపు రంగు మహిళలకు మంగళకరమైనదని, ఆకుపచ్చ రంగు రైతులకు ప్రతిరూపమని కవిత వివరించారు. కానీ.. బీఆర్ఎస్‌లోని సగం కేడర్ తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చినవారేనని, వారు సహజంగానే యాంటీ కాంగ్రెస్, యాంటీ బీజేపీ కావడంతో ఎటూ పోలేకపోతున్నారనే ఒక అభిప్రాయం ఉన్నది. బీఆర్ఎస్ పార్టీ పేరు మార్పును జీర్ణించుకోలేక ఇప్పుడు కవిత పార్టీవైపు ఓట్లు షిఫ్ట్ అవుతాయనే ఉద్దేశంతోనే పసుపు రంగును ఎంచుకున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. బీసీలు, ఎస్సీల ఓటు బ్యాంకును దృష్టిలో పెట్టుకుని నీలం రంగు పెట్టారన్నది మరో వాదన.

## లీగల్ చిక్కులు రావొద్దనే 'అసోసియేషన్' పదం

కవిత కొత్తగా పెట్టిన పార్టీలో 'తెలంగాణ రాష్ట్ర సేన' అనే పదాల తర్వాత చిన్న అక్షరాల్లో 'అసోసియేషన్' అనే పదాన్ని తగిలించారు. ఆమె ప్రకటించిన ఈ పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఇంకా ఖరారు చేయలేదు. ఎలాగూ ఆ పార్టీ పేరుతో ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియజేసేందుకు 30 రోజుల అవకాశాన్ని కమిషన్ ఇస్తుంది. పబ్లిక్ డొమైన్‌లో పార్టీ పేరును ప్రకటించి అభ్యంతరాలను స్వీకరిస్తుంది. టీఆర్ఎస్ అనే అబ్రివేషన్ వచ్చేలా పార్టీ పేరును ఎంపిక చేసుకున్నందున ఎవరి నుంచైనా అభ్యంతరాలు వస్తే లీగల్‌గా ప్రొటెక్షన్ ఉండేలా కంటికి కనిపించనంత చిన్న అక్షరాల్లో 'అసోసియేషన్' అనే పదాన్ని పెట్టుకున్నట్లు జాగృతి వర్గాల సమాచారం. సాధారణంగా ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం.. ఒక స్వచ్ఛంద సంస్థకు లేదా సొసైటీకి, పొలిటికల్ పార్టీకి మధ్య తేడా ఉండేందుకు పార్టీ లేదా అసోసియేషన్ లేదా డెమొక్రటిక్ వంటి పదాలు పేరు చివరన ఉండాలి. అలాంటి నిబంధనలు, ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగానే లీగల్ చిక్కుల్లేకుండా అసోసియేషన్ అనే పదాన్ని వాడుతున్నట్లు తెలిసింది.



# మన మనిషి కాదు మర మనిషి

## కేసీఆర్‌పై కవిత ఫైర్

గుంటనక్కల చేతుల్లో బందీ అయ్యాడు

ఉద్యమ ద్రోహులకు పదవులు ఇచ్చాడు

ఉద్యమకారులకు కనీసం మర్యాద ఇవ్వలేదు

రాష్ట్రాన్ని వదిలి జాతీయపార్టీ అన్నాడు

వ్యక్తిగత ఫోన్లను విన్నారు

ఆ కుటుంబంలో నేను భాగమైనందుకు సిగ్గుపడుతున్నా

ఎక్కడ కష్టం వచ్చినా ఆ సారు రారు అని విమర్శ



**ఏం తప్ప చేసిన?**

ఏం తప్ప చేశానని పార్టీ నుంచి తనను సస్పెండ్ చేశారని కేసీఆర్ ను కవిత ప్రశ్నించారు. "కాళేశ్వరం మీద మాట్లాడితే సస్పెండ్ చేస్తారా? అవినీతి పందికొక్కులను కేసీఆర్ పక్కన పెట్టుకున్నాడు" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కలం, తెలంగాణ బ్యూరో:**

పార్టీ ప్రకటన వేదిక నుంచే కవిత తన తండ్రి కేసీఆర్ పై నిప్పులు చెరిగారు. ''ప్రజల కోసం కొట్లాడాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడ? ఫామ్‌హౌస్‌ను విడిచి ఆయన బయటకు రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నా. కేసీఆర్ రాజకీయ పరిణతి కోల్పోయారు. ఉద్యమ నేతగా ఉన్నప్పుడు ఒక లెక్క.. అధికారం వచ్చాక మరో లెక్క.. ఇప్పుడు ఇంకో లెక్క తయారయ్యాడు. మారిన మరబొమ్మ కేసీఆర్. మాటల మనిషి, మర మనిషి, మారిన మనిషి కేసీఆర్" అంటూ దుయ్యబట్టారు. ''ఎక్కడ కష్టం వచ్చినా ఆ సారు రారు. గుంట నక్కల, తోడేళ్ల చేతిలో బందీ అయ్యాడు. ఆయన మనం అనుకున్న కేసీఆరే అయితే పాలమూరు దగ్గర కుర్చీ వేసుకొని మరీ పనులు పూర్తి చేసేవారు. కేంద్రంతో గొడవలు పెట్టుకోకుండా ఉండి ఉంటే ఇప్పటికే పాలమూరు ప్రాజెక్టు పూర్తయేది. ఈ కేసీఆర్ తెలంగాణను వదిలిపెట్టి ఇతర రాష్ట్రాలు తిరిగారు. ఇక్కడ వదిలేసి గుజరాత్, పంజాబ్, బిహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారు. నేను ఎన్ని మాట్లాడినా బీఆర్ఎస్ నేతలు సమాధానం ఇవ్వడం లేదు.. సమాధానం చెప్పకపోతే ప్రజలే బయటకు లాగి జవాబు చెప్పేలా చేస్తారు" అని హెచ్చరించారు. హైదరాబాద్ శివారు మునీరాబాద్ వేదికగా కవిత తన కొత్త పార్టీ 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)'ను ప్రకటించారు. పార్టీ పెట్టడానికి, టీఆర్ఎస్ అని అబ్రివేషన్ తీసుకోవడానికి కారణాలను.. భవిష్యత్ కార్యాచరణను వివరించారు. పదేండ్లు రాష్ట్రాన్ని పాలించి ప్రతిపక్షానికి పరిమితమైన తన తండ్రి కేసీఆర్ తోపాటు కాంగ్రెస్, బీజేపీపై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ మారుతారేమోనని తాను చూశానని, కానీ తెలంగాణ ఉద్యమకారుల మీద కట్టెలతో దాడులు చేసినవాళ్లకు ఆయన పదవులు ఇచ్చారని కవిత మండిపడ్డారు. ''ఎప్పుడైనా ఉద్యమకారులకు వాళ్లు మర్యాద ఇచ్చారా? కేసీఆర్ మారిపోయారు కాబట్టే నేను యుద్ధం చేస్తున్నా" అని ఆమె స్పష్టం చేశారు.




### బీజేపీకి తెలంగాణ ఏర్పాటే ఇష్టం లేదు

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ఇష్టంలేదని కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. ''తల్లిని చంపి పిల్లను బతికించారని ఆ పార్టీలోని ఒకరు అంటారు. భారత్, పాక్ విడదీసినట్లు తెలుగు రాష్ట్రాలను విభజించారని మరో ఎంపీ అంటారు. అయినా బీజేపీలోని ఇక్కడి బానిస ఎంపీలు ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. అందుకే అంటున్నా తెలంగాణ ఏర్పాటు వాళ్లకు ఇష్టం లేదు. తెలంగాణ నుంచి ఏడు మండలాలను లాక్కుంటే బీజేపీ ఎంపీలు మాట్లాడరు.. విభజన హామీలు కేంద్రం నెరవేర్చకపోయినా వాళ్లు మాట్లాడరు.. సామాజిక న్యాయానికి వ్యతిరేకి బీజేపీ" అని కవిత దుయ్యబట్టారు. ''తెలంగాణలోని బీజేపీ ఎంపీలకు సవాల్ చేస్తున్నా..! మీరు తెలంగాణ బిడ్డలైతే.. ఏపీలో కలిపిన కనీసం 5 ఊర్లయినా వెనక్కి వచ్చేలా చూడండి. భద్రాచలం దగ్గర ఉన్న ఐదు ఊర్లు పోతే రాముడి గుడి మునుగుతుంది. ఆ గ్రామాలను వెనక్కి తేవడానికి జాగృతి తరపున కేంద్రానికి లేఖ రాశాం. అయినా కేంద్రం స్పందన లేదు" అని కవిత తెలిపారు.



### రేవంత్.. కర్కోటకుడు, హిట్లర్

ఒక కర్కోటకుడి పరిపాలన రాష్ట్రంలో జరుగుతున్నదని కవిత విమర్శించారు. ''మొన్న ఖమ్మం వెలుగుమట్లలో అర్ధరాత్రి ఇళ్లు కూలగొట్టారు. ఆ టెన్షన్ లో ఓ నిండు గర్భిణికి అబార్షన్ అయింది. వాళ్ల బాధ ఇంకా చెవులకు వినిపిస్తూనే ఉంది. రెండునెలల చిన్న పాప కుమ్మెర గ్రామంలో చనిపోతే ఇప్పటికీ కేసు పెట్టడం లేదు.. హోంమంత్రి కూడా ముఖ్యమంత్రి అయినా ఆయనకు తీరిక లేదట. గురుకులాల్లో పిల్లలు చనిపోతున్నా.. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం మాట్లాడటం లేదు. అందుకే ఆయనను కర్కోటకుడు, హిట్లర్ అనే అంటున్న. రాక్షస కాంగ్రెస్ పైనా కొట్లాడుతాం. ప్రధాన ప్రతిపక్షంగా ఉంటాం.. రెండేండ్ల తర్వాత అధికారపక్షం అవుతాం" అని చెప్పారు.



## కవితమ్మగా మారిన కవితక్క..?

తెలంగాణలోని మూడున్నర కోట్ల మందికి తాను అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్నానని కవిత తెలిపారు. ''అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డల కష్టం తెలుస్తుంది. ఆ కష్టాలను అమ్మ తీరుస్తుంది. తల్లి జేబు చూడదు.. కడుపు చూస్తుంది. తెలంగాణలో ఏండ్ల తరబడి భూస్వామ్య వ్యవస్థ నడిచింది. ఎందరో పోరాడితే కొంత సమానత్వం వచ్చింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఎందరో ఉద్యమకారులు పోరాడితే, ఎందరో అమరులైతే రాష్ట్రం ఏర్పడింది. ఇన్నేండ్ల స్వరాష్ట్రంలో ఉద్యమ కలలు సాకారం కాలేదు. సామాజిక తెలంగాణను సాధించుకుందాం'' అని చెప్పారు.

### మేమే ప్రతిపక్షం

రాష్ట్రంలో ఇప్పటి వరకు ప్రతిపక్షం లేదని కవిత అన్నారు. ఇప్పుడు ప్రజల సమస్యల పరిష్కారం కోసం తామే ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని, రెండేండ్ల తర్వాత అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో తమ టీఆర్ఎస్ పార్టీ పోటీ చేస్తుందని కవిత ప్రకటించారు. ''కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్.. మూడు పార్టీలు అవినీతి, బంధుప్రీతి, అధర్మంతో నిండిపోయాయి'' అని ఆమె ఆరోపించారు.

### ఉచిత విద్య, ఉచిత వైద్యం

సామాజిక తెలంగాణ కోసం తెలంగాణ రాష్ట్ర సేన పనిచేస్తుందని, అధికారంలోకి వస్తే పేద మధ్య తరగతి ప్రజలకు ఫలాలు అందిస్తామని కవిత తెలిపారు. ఈ సందర్భంగా ఐదు హామీలను ప్రకటించారు. 'పాంచజన్యం' అంటూ పేరు పెట్టారు. కేజీ టు పీజీ వరకు ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ ఉచిత విద్య అందేలా చూస్తామని, తెలంగాణ ప్రజలకు ఎలాంటి రోగం వచ్చినా ఎంతటి హాస్పిటల్ లోనైనా ఉచితంగా వైద్యం అందిస్తామని, రైతును రాజు చేయడమే తమ నినాదమని, మొదటి ఏడాదిలోనే 4 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, సామాజిక న్యాయం అందిస్తామని హామీ ఇచ్చారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రతి తెలంగాణ అమరవీరుడి కుటుంబానికి కోటి రూపాయల చొప్పున సాయం చేస్తామని ప్రకటించారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు.



# ఉద్యమ కలలు కల్లలయ్యాయి

ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదని కవిత అన్నారు. కేసీఆర్ సారథ్యంలోని ఉద్యమ రథం దారి తప్పిందని, రాష్ట్ర ప్రజల ఆర్తిని బీఆర్ఎస్ అర్థం చేసుకోలేకపోయిందని విమర్శించారు.

- ''సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగ్గా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించినం. కానీ, రైతులకు బేడీలు పడ్డాయి. ఇసుక దందా ముఠాల వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం... వ్యక్తిగత స్వేచ్ఛలేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికింది. మనం అనుకున్న తెలంగాణ రాలేదనేని ముమ్మాటికీ వాస్తవం. పదేండ్లు పరిపాలించిన కుటుంబంలో నేను భాగమైనందుకు కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నా. తెలంగాణ ప్రజలను క్షమించాలని కోరుతున్నా. కానీ, తప్పులో నాకూ భాగం ఉన్నందుకు క్షమాపణ చెబితే సరిపోదు. సామాజిక తెలంగాణ కోసం కష్టపడి పనిచేస్తాం. పనిచేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీ ప్రజల ముందుకు వచ్చింది. ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలి. బీఆర్ఎస్ సాంకేతికంగా ఉన్నా ఆత్మను కోల్పోయింది. బీఆర్ఎస్ ఆత్మను కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ ఎస్) వచ్చింది'' అని కవిత వివరించారు.
- ''నాడు కేసీఆర్ పెట్టిన టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి) కోసం నా రక్తం, చెమట, సమయం ధారపోసిన. పార్టీ బలోపేతం కోసం పనిచేసిన. ఆ నాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరు. చేనేత కార్మికులు చనిపోతుంటే.. ఆ నాటి కేసీఆర్ భిక్షాటన చేశారు. ఇప్పటి కేసీఆర్ ఫామ్ హౌస్ ను వదలని మనిషి'' అని కవిత వ్యాఖ్యానించారు.






# మాది ఒరిజినల్.. మీది ఫేక్

### కవితపై కేసీఆర్ పార్టీ సెటైరికల్ పోస్టు

కవిత తన పార్టీ పేరును 'టీఆర్ఎస్' అని ప్రకటించగా.. కేసీఆర్ పార్టీ బీఆర్ఎస్ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ లో విమర్శలు గుప్పించింది. ''ఒరిజినల్ బ్రాండ్స్ కు ఉన్న పాపులారిటీని క్యాష్ చేసుకోవాలని, తొందరగా డబ్బు సంపాదించాలని కొంతమంది ఇట్లా ఫేక్ బ్రాండ్స్ తయారుచేసి అమ్మడానికి ప్రయత్నిస్తుంటారు. ప్రజలు ఏది ఒరిజినల్, ఏది డూప్లికేట్ తెలుసుకోలేనంత అమాయకులు కాదు!'' అంటూ రాసుకొచ్చింది. దీనికి ఒరిజినల్ 'కోల్‌గెట్ (Colgate)', ఫేక్ 'కూల్ గెట్ (Coolgate)'.. ఒరిజినల్ 'బిస్లెరీ (Bisleri)', ఫేక్ 'బ్రిస్లీ (Brislie)' అంటూ ఫొటోలను జోడించింది. ఇంకా కొన్ని బీఆర్ఎస్ సోషల్ మీడియా హ్యాండిల్స్ అయితే.. ''తెలంగాణ రాష్ట్ర సేన కాదు.. తెలంగాణ రేవంత్ సేన'' అని పోస్టులు పెట్టాయి.